ప్రజాశక్తి

ఆదివారం 20 అక్టోబర్ 2024

5



అల్లూరి సీతారామరాజు

నేడు విద్యార్థులకు పోటీ పరీక్షలు

ప్రజాశక్తి- ముంచింగిపుట్టు : నర్సీపట్నం రామానుజన్ అకాడమీ ఆఫ్ కాంపిటేటివ్ ఎగ్జామినేషన్స్ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని శారద నికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో మండలంలోని వివిధ విద్యార్థులకు పోటీపరీక్షలపై అవగాహనకు ఈనెల 20న ఆదివారం ఉదయం 9:30 నుండి 12:30 గంటలకు వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రవేశ రుసుము చెల్లించిన నాలుగవ తరగతి నుండి 8వ తరగతి విద్యార్థులకు ఈ పరీక్షలో పాల్గొంటారన్నారు. ఈ ప్రవేశ పరీక్షలో మానసిక సామర్థ్యం 20 మార్కులు, తార్కిక సామర్థ్యం 20, ఆంగ్ల భాష 20, సామాన్య శాస్త్రం 20, అంకగణితం 20 చొప్పున 100 మార్కులకు ప్రశ్నాపత్రం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందజేస్తారని శారద పాఠశాల యాజమాన్యం తెలిపింది. జాతీయ స్థాయి పోటీ పరీక్షలపై అవగాహన, సన్నద్ధతకు ఈ పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. వివరాల కొరకు 9491296226, 7901272312 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

వెంటాడుతున్న డోలీ కష్టాలు

- గర్భిణిని ఐదు కిలోమీటర్లు మోసుకెళ్లిన కుటుంబసభ్యులు



డోలీలో గర్భిణి రాములమ్మను మోసుకెళుతున్న కుటుంబసభ్యులు

ప్రజాశక్తి -అనంతగిరి : మారుమూల గిరిజన గ్రామాలకు కనీస రోడ్డు సౌకర్యం లేక గిరిజన గర్భిణులు, రోగులకు డోలీమోత కష్టాలు తప్పడం లేదు. మండలంలోని గుమ్మ పంచాయతీ మారుమూల కర్రిగోడ గ్రామానికి చెందిన బద్నాయిని రాములమ్మకు శనివారం పురిటి నొప్పులు రావడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వెంటనే కర్రలతో డోలీ కట్టి, ఎత్తయిన కొండలు, రాళ్ళ రప్పలున్న అటవీ మార్గంలో సుమారు ఐదు కిలోమీటర్ల దూరం భుజానమోసి గుమ్మ పంచాయతీ కేంద్రంవరకు తీసుకొచ్చారు. అక్కడ నుంచి ప్రైవేటు ఆటోలో ఎస్.కోట ఏరియా ఆసుపత్రుకు తరలించారు. కర్రి గోడ, కరడేవు, ముల్లెలు తదితర అయిదు గిరిజన గ్రామాల రోగులు, గర్భిణులకు అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వెళ్లాలంటే డోలీమోతే శరణ్యం. లుంగపర్తి పిహెచ్‌సికి వెళ్లాలన్నా వీరు ఇటువంటి కష్టాలు ఎదుర్కోక తప్పడం లేదని ఆయా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అటవీశాఖ అభ్యంతరంతో నిలిచిన రోడ్డు పనుల వల్లే అవస్థలు

మిషన్ పాడేరు కనెక్టివిటీ ప్రాజెక్టు కింద 2020-21లో రూ.కోట్ల నిధులతో సంబంధిత అధికారులు గుమ్మ గ్రామం నుంచి రోడ్డు పనులు మొదలుపెట్టి, మూడు కిలోమీటర్లు పూర్తిచేయగా, ఇంతలో అటవీశాఖ అధికారుల అభ్యంతరంతో రోడ్డు పనులు నిలిచిపోయాయి. తర్వాత వీటి గురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో అసంపూర్తిగా మిగిలిన రోడ్లుతో గిరిజనులు ఇబ్బందులకు గురవుతున్నారు.

బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దు

- ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు లోతా రామారావు, కిల్లో సురేంద్ర
- మంత్రి సవిత ప్రకటనపై ఖండన
- స్పష్టతనివ్వాలని కూటమి ప్రభుత్వానికి డిమాండ్



మాట్లాడుతున్న కిల్లో సురేంద్ర, లోతా రామారావు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: ఎన్నికల వాగ్దానాలు ప్రకారం బోయ/వాల్మీకులను గిరిజన జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానించి, కేంద్రానికి పంపుతున్నట్లు బిసి సంక్షేమశాఖ మంత్రి సవిత ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు లోతా రామారావు, కిల్లో సురేంద్ర మండిపడ్డారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, అనంతపురంలో జరిగిన వాల్మీకి మహర్షి జయంతి సమావేశంలో బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత బోయ/వాల్మీకులను తెలుగుదేశం పార్టీ, కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాల మేరకు అసెంబ్లీ తీర్మానంతో కేంద్రానికి పంపుతామని చెప్పడాన్ని తీవ్రంగా ఖండించారు. బోయ/వాల్మీకులను గిరిజన జాబితాలో చేర్చాలన్న నిర్ణయాన్ని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. బోయ/వాల్మీకులను గిరిజన జాబితాలో చేర్చితే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 28 లక్షల మంది ఆదివాసీల ఆగ్రహం చవిచూడక తప్పదని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

బోయ/వాల్మీకులపై బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత ఇచ్చిన ప్రకటనపై కూటమి ప్రభుత్వంలోని గిరిజన సంక్షేమ మంత్రి, గిరిజన ప్రాంత ఎంపిలు ,ఎమ్మెల్యేలు వైఖరి ఏమిటో ప్రకటించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడచిని జిఒ 3 పునరుద్ధరణ, చట్టబద్ధత, గిరిజన ప్రత్యేక డిఎస్‌సి ప్రకటన హామీలపై అతీగతీ లేదని, దీనిపై వెంటనే ప్రకటన చేయాలన్నారు. బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు గత వైసిపి ప్రభుత్వం శ్యాముల్ ఆనంద్ కమిటీ వేసిందని, అంతకుముందు తెలుగుదేశం ప్రభుత్వం కూడా కారం శివాజి కమిటి వేసి బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు యత్నించిందన్నారు. ఇపుడు రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ చర్యలను ముమ్మరం చేస్తున్నట్లు కనిపిస్తోందని, వెంటనే ఆ నిర్ణయాన్ని విరమించుకోకుంటే వైసిపికి పట్టిన గతే కూటమి ప్రభుత్వానికి తప్పదని హెచ్చరించారు..తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సలహా మండలి ఏర్పాటు చేసి బోయ/వాల్మీకులను గిరిజన జాబితాలో చేర్చకుండా తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రభుత్వానికి గిరిజన ప్రజానీకం తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.



సమావేశంలో పాల్గొన్న ఐటిడిఎ పిఒ సింహాచలం, అధికారులు

వన్ ధన్ వికాస్ కేంద్రాల అభివృద్ధికి చర్యలు

- ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని వన్ ధన్ వికాస్ కేంద్రాలను అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. ఐటిడిఎ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో జిసిసి డివిజన్ మేనేజర్, వెలుగు డిపిఎం, ఎపియంలతో శనివారం నిర్వహించిన సమావేశంలో పిఒ మాట్లాడుతూ ఏజెన్సీలోని మహిళా సంఘాల సభ్యులు వన్ ధన్ వికాస్ కేంద్రాల ద్వారా అభివృద్ధి చెందే విధంగా ఎప్పటికప్పుడు ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. వన్ ధన్ వికాస్ కేంద్రాల ద్వారా వెయ్యి మంది సభ్యులను గుర్తించి శిక్షణ ఇచ్చి ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. ఈ కేంద్రాలు అభివృద్ధికి వెలుగు, జిసిసి అధికారులు, సిబ్బంది కలిసి పని చేయాలని సూచించారు. వచ్చే సీజన్లో పసుపు, చింతపండు, చీపుర్లు, జీడిపిక్కలు, జాఫ్రాలు తదితర అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిసిసి డివిజనల్ మేనేజర్ జి.పార్వతీశ్వరరావు, డిపిఎం అపర్ణ, యాంకర్ పర్సన్ రామరాజు, ఏపీయంలు తదితరులు పాల్గొన్నారు.

చర్చల్లో దాటవేత వైఖరి సరికాదు!

- కాఫీ కార్మిక సంఘంతో ఎపిఎఫ్‌డిసి చర్చలు విఫలం
- అధికారుల తీరుపై చిన్నయ్య పడాల్ ఆగ్రహం



అధికారులతో చర్చల్లో పాల్గొన్న కాఫీ కార్మికసంఘం నేతలు

ప్రజాశక్తి - చింతపల్లి :సమస్యలను పరిష్కరించకుండా, చూస్తాం, చేస్తాం అంటూ అధికారుల దాటవేత ధోరణితో కాఫీ కార్మిక సంఘంతో శనివారం ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థ (ఎపిఎఫ్‌డిసి) అధికారుల చర్చలు విఫలమయ్యాయని కాఫీ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. అటవీ అభివృద్ధి సంస్థ పాడేరు, చింతపల్లి డివిజనల్ మేనేజర్లు కన్నబాబు, రత్న దీపిక, మాజీ డివిజనల్ మేనేజర్ మహేశ్వరరావులతో కాఫీ కార్మికసంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్ కనకవల్లి, ఎల్ సుందరరావు, ప్లాంటేషన్ హెల్పర్స్ వెంకటేష్ రాజారావు పాపారావులతో కలసి జరిపిన చర్చలు ఫలప్రదం కాలేదు.

మూడు గంటలపాటు కార్మికులు పెట్టిన పది డిమాండ్లపై ప్రాథమికంగా చర్చల్లో ఎటువంటి పురోగతి కనిపించలేదు. విడిఎ పాయింట్లు ఆధారంగా కూలి, పండ్ల రేట్లు పెంపు, తగినంతమంది హెల్పర్లను నియమించి జీతాలు పెంపు తప్ప, మిగతా డిమాండ్లు చూస్తాం, చేస్తాం అనే అధికారుల వైఖరిపై ఉన్నత అధికారులకు నివేదిస్తామని కార్మిక సంఘం తెలిపింది. ఈ చర్చల్లో కార్మికులకు సంస్థ అధికారులు ఎటువంటి భరోసా కలిగించలేకపోయారని కార్మిక సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. నివాస గృహాలు మరమ్మత్తులు చేస్తామని, బడ్జెట్ తయారుచేసి పంపిస్తామన్నారు, నెలకు 26 రోజులు పని దినాలు కల్పించలేని పక్షంలో రోజు కూలి ఇవ్వాలని కాఫీకార్మిక సంఘం డిమాండ్ చేసింది. హెల్పర్లకు గుర్తింపు కార్డులు ఇవ్వటానికి అంగీకరించింది, ప్లాంటేషన్ కండక్టర్ 300 మందిని నియమిస్తే తప్ప తోటలు సంరక్షణ సాధ్యం కాదని కార్మిక సంఘం ప్రతినిధులు తేల్చి చెప్పారు, కూలి రేట్లు, పండ్ల రేట్లు తేల్చితే తప్ప కార్మికులు అంగీకరించబోరని, అవసరమైతే సమ్మెకు వెనకడబోరని ఈ సందర్భంగా కార్మిక సంఘం తేల్చి చెప్పింది. కార్మికుల సమస్యలు, చర్చల వైఫల్యాన్ని రీజనల్ మేనేజర్ దష్టికి తీసుకువెళ్లి మళ్లీ పరిష్కరించుకునే ప్రయత్నం చేస్తామని ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ స్పష్టం చేశారు.

జీవ వైవిధ్య పరిరక్షణతో రైతులకు మేలు



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : భూముల జీవ వైవిధ్య పరిరక్షణ చర్యలు చేపడితే రైతులకు మేలు జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్‌కుమార్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వాసన్, రెయిఫారెస్ట్ ఎలియన్స్, రైతుసాధికార సంస్థలఆధ్వరంలో జీవవైవిధ్యభరిత సుస్థిర వ్యవసాయ విధానాలు, భూవనరుల యాజమాన్య పద్ధతులపై వర్కుషాపు నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూక్షీణత సమస్యలు, సవాళ్లను అధిగమించాలన్నారు. సామాజిక సాంస్కృతిక వ్యవస్థలను బలోపేతం చేయాలన్నారు. సూక్ష్మ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ఆర్ఇఎఫ్ఆర్ భూములలో ల్యాండ్ స్కేప్ మేనేజ్‌మెంటు పనులు చేపట్టాలని స్పష్టం చేసారు. డ్వామా ఆధ్వర్యంలో ల్యాండ్ స్కేపింగ్ పనులు నిర్వహించాలని ఆదేశించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేస్తామన్నారు. జీవవైవిధ్యంతో భూసంరక్షణ అధికంగా పెరుగుతుందన్నారు. భూసారం పెరగడం వలన రైతులు అధిక దిగుబడులు సాధిస్తారన్నారు. నీటి యాజమాన్య పద్ధతులను అవలంభించాలని, పశు, మత్స్య సంపద పెరగడానికి వ్యవసాయానుబంధ శాఖలు తగిన చర్యలు చేపట్టాలన్నారు. సహజ పర్యావరణ పరిరక్షణతో పాటు వ్యవసాయ విస్తరణ జరగాలని చెప్పారు. గ్రామ సచివాలయం పరిధిలోని వ్యవసాయ భూములను గుర్తించాలని,. భూముల గుర్తింపు, రైతులు సాగు చేస్తున్న వ్యసాయ పంటల నమోదుకు సచివాలయం సిబ్బందితో కమిటీలు నియమించాలని స్పష్టం చేసారు. నీటి సంరక్షణ పనులు నిర్వహించడానికి ఇద్దరు రిసోర్సుపర్సన్లను తయారు చేయాలన్నారు. వివిద స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న వ్యవసాయ సహాయక చర్యలను సంబంధిత సంస్థల ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. స్వయం సహాయ సంఘాల సభ్యులకు రూ.800 కోట్ల వ్యవసాయ రుణాలు అందించడం జరిగిందన్నారు. రైతులు అధిక దిగుబడులు సాధించే విధంగా ప్రోత్సహించాలని చెప్పారు. పర్యావరణ పరిరక్షణ కు అందరూ కషి చేయాలని సూచించారు. సబల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో చేపడుతున్న భూసంరక్షణ, ల్యాండ్ స్కేపింగ్ పనులపై ఆ సంస్థ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టరుకు వివరించారు.పర్చువల్ విధానంలో పాడేరు ఐటిడిఎ పిఒ వి.అభిషేక్, రంపచోడవరం పిఒ కె.సింహచలం, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బిఎస్. నంద్, డిఆర్‌డిఎ పీడీ వి.మురళి, డ్వామా పీడీ. శివయ్య, వాసన్, రెయిన్ ఫారెస్టు ఎలయన్స్,రైతు సాధికార సంస్థ ప్రతినిధులు సీనియర్ టెక్నికల్ సహాయకులు వినూత్న, టెక్నికల్ నిపుణులు సౌమిత్ర, అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్‌సన్ని, జిల్లా ప్రోగ్రాం అధికారి నాయుడు, డిపిఎం భాస్కరరావు పాల్గొన్నారు.



సబ్ స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు, గిరిజనులు

విద్యుత్ భారాలపై సిపిఎం నిరసన

ప్రజాశక్తి-కొయ్యూరు

ఇంధన సర్దుబాటు, ట్రూ అప్ ఛార్జీల పేరుతో భారాలు మోపడాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండలంలోని కాకరపాడు విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట సిపిఎం ఆధ్వర్యాన శనివారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ ఎస్.సూరిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచేందుకే విద్యుత్ నియంత్రణ మండలితో మొక్కుబడిగా ప్రజాభిప్రాయ సేకరణ చేయిస్తోందని విమర్శించారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ట్రూ అప్ ఛార్జీలు వసూలు చేస్తే నాటి ప్రతిపక్షంలో ఉన్న టిడిపి, మిత్రపక్షాలు బాదుడే బాదుడు పేరుతో ఆందోళన కార్యక్రమాలు చేపట్టి, నేడు అధికారంలోకి వచ్చిన తరువాత అదే రీతిలో విద్యుత్ భారాలు మోపడం దారుణమన్నారు. కార్యక్రమంలో ప్రజలు పాల్గొన్నారు.

టేకు వనాల రక్షణకు పకడ్బందీ చర్యలు

- చింతపల్లి డిఎఫ్‌ఒ వెంకట నరసింహారావు



టేకు వనాల్లో ప్రాజెక్టు మ్యాపును పరిశీలిస్తున్న డిఎఫ్ఓ వెంకట నరసింహారావు

ప్రజాశక్తి -సీలేరు

సీలేరు అటవీ రేంజి పరిధిలో టేకు వనాల రక్షణకు పగడ్బందీగా చర్యలు చేపట్టాలని చింతపల్లి డిఎఫ్ఓ వై.వెంకట నరసింహారావు రేంజ్ అధికారి సుంకరి వెంకటరావును ఆదేశించారు. చింతపల్లి డిఎఫ్ఓగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన సీలేరు రేంజ్ కార్యాలయాన్ని శనివారం సందర్శించి రికార్డుల పరిశీలించారు. అటవీ శాఖ టింబర్ డిపో వెనుక ఉన్న టేకు వనాలను పరిశీలించారు. అనంతరం అటవీశాఖ రేంజ్ అధికారి సుంకరి వెంకటరావు, సిబ్బందితో అటవీ శాఖ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీలేరు రేంజ్ పరిధిలో నూతనంగా నర్సరీలు ఏర్పాటు చేసి జాఫర, సిల్వర్ ఓక్ ఇతర జాతి మొక్కలు 80.000 పెంచేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వచ్చే ఏడాది జూన్‌లో రైతులకు ఉచితంగా మొక్కలు పంపిణీ చేసి వాటి సంరక్షణ, పెంచే బాధ్యత వాళ్లకే అప్పగించాలని పేర్కొన్నారు. అటవీ సంపద చోరీకి గురికాకుండా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తూ నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

రెండో రోజూ పంపు స్టోరేజ్ ప్రాజెక్టు స్థల పరిశీలన

సీలేరు జల విద్యుత్ కేంద్రం సమీపంలో పార్వతీ నగర్ వద్ద 1350 మెగావాట్లు గల పంపు స్టోరేజ్ ప్రాజెక్ట్ నిర్మాణానికి అవసరమైన రిజర్వ్ ఫారెస్ట్ భూమిని డీఎఫ్ఓ వెంకట నరసింహారావు పరిశీలించారు. రిజర్వ్ ఫారెస్ట్‌లో ప్రాజెక్టు నిర్మాణానికి డంపింగ్ యార్డ్‌కు అవసరమైన 193.01 హెక్టర్ల భూమి ఏపీ జెన్కో అటవీ శాఖకు ప్రతిపాదించింది. దానికి సంబంధించిన అటవీ క్లియరెన్స్ నిమిత్తం రిజర్వ్ ఫారెస్ట్ ఆధీనంలో ఉన్న పార్వతీ నగర్ జొన్న మామిడి టింబర్ డిపో వెనుక సీలేరు రేంజి అటవీ పరిసర ప్రదేశాలను పరిశీలన చేశారు. హద్దురాళ్ళు, ప్రాజెక్టు మ్యాపు పరిశీలించి ప్రాజెక్టు సంబంధించిన పూర్వాపరాలు పంపు స్టోరేజ్ ప్రాజెక్టు ఎస్ఈ సివిల్స్ చంద్రశేఖర్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్కో (ఈఈ) జి.భాస్కరరావు, డిఈఈ టి.అప్పలనాయుడు, సీలేరు రేంజి అధికారి సుంకరి వెంకటరావు, డిఆర్ఓ సింహాచలం పడాల్, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డొంకరాయి ఎస్ఐ శివకుమార్

అడవి జంతువులకు విద్యుత్ వైర్లు పెడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి-వై.రామవరం

అడవి జంతువులను వేటాడటానికి విద్యుత్ వైర్లు పెడితే కఠిన చర్యలు తప్పవని డొంకరాయి ఎస్సై శివకుమార్ హెచ్చరించారు. వై రామవరం మండలం బొడ్డగండి పంచాయితీ మంగంపాడులో శనివారం గిరిజనులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వైర్లు పెట్టి జంతువుల్ని వేటాడినట్లయితే జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. అటువంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే తమకు సమాచారం వెంటనే ఇవ్వాలని కోరారు. వన్యప్రాణులను కాపాడవలసిన అవసరం ఎంతైనా ఉందని, వాటిని విద్యుత్ షాక్‌తో చంపడానికి ప్రయత్నిస్తే దానికి కారకులైన వారిని కేసు నమోదు చేసి జైలు పంపించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి ట్రాన్స్‌కో ఉద్యోగులు, గిరిజనులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

- డిఎంహెచ్‌ఒ డాక్టర్ జమాల్‌బాషా



రోగులతో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ డాక్టర్ బాషా

ప్రజాశక్తి -హుకుంపేట: వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ, రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డిఎంహెచ్‌ఒ డాక్టర్ జమాల్‌భాషా అన్నారు. శనివారం స్థానిక పిహెచ్‌సిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందుతున్న సేవలపై రోగులతోపాటు హుకుంపేట వైద్య అధికారి డాక్టర్ సౌజన్యను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, రోగులకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండే విధంగా చూడాలని ఆదేశించారు. తర్వాత బారాపల్లి గ్రామంలో ఇమ్యునైజేషన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలు, టీబీ వ్యాధిగ్రస్తులతో మాట్లాడి, వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది పిహెచ్‌ఎన్ జమ్మి, టిబి సూపర్‌వైజర్ సదానందం, ఎఎన్ఎంలు సుశీల, గాయత్రి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-పెదబయలు/ ముంచంగిపుట్టు : నాటుపడవపై చేపల వేటకు వెళ్లి మత్స్యగెడ్డలో గల్లంతైన కొర్ర వేణుగోపాలస్వామి మృతదేహం శనివారం లభ్యమైంది. సీతగుంట పంచాయతీ రోగుల గ్రామానికి చెందిన వేణుగోపాలస్వామి గురువారం నాటుపడవపై చేపల వేటకు వెళ్లగా, నీటిలో మునిగిపోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై అల్లూరి జిల్లా.కలెక్టర్, పాడేరు ఐటిడిఎ పిఒల దృష్టికి తీసుకెళ్లగా, వారి ఆదేశాల మేరకు విశాఖ నుంచి ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు, 16మంది గజ ఈతగాళ్లు వచ్చి మత్స్యగెడ్డలో గాలింపు చర్యలు చేపట్టారు. దీశనివారం మధ్యాహ్నానికి మృతదేహం లభ్యమైంది.స్థానిక సర్పంచ్ పి.మాధవరావు సమక్షంలో శవ పంచనామా నిర్వహించి, అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు

ఎంపిడిఒగా శశిభూషణరావు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరణ అనంతరం సిబ్బందితో సమావేశమైన ఎంపిడిఒ

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని రేఖపల్లి మండల పరిషత్తు కార్యాలయంలో నూతన ఎంపిడిఒగా హెచ్.శశిభూషణరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బందితో ఆయన ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శశిభూషణరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో అందరు అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, ప్రజలకు మధ్య సిబ్బంది వారధిగా ఉండి విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, మహిళ పోలీస్‌లు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సీలేరు పంచాయతీ కార్యదర్శిగా పరశురాం బాధ్యతలు స్వీకరణ

సీలేరు : జీకే వీధి మండలం సీలేరు పంచాయతీ కార్యదర్శిగా వంతల పరశురాం శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పంచాయితీ సర్పంచ్ దుర్జో అధ్యక్షతన పాలకవర్గ సభ్యులతో సమావేశం నిర్వహించారు. వార్డు సభ్యులు, టిడిపి కూటమి నాయకులను కార్యదర్శి పరశురాం పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. తరువాత సచివాలయ సిబ్బందితో సర్పంచి కార్యదర్శి సమావేశమై మాట్లాడారు. విధి నిర్వహణలో అలసత్వం వహించరాదన్నారు. కార్యక్రమంలో గుమస్తా ప్రకాష్, ఉపసర్పంచ్ కె.వల్లి ప్రసాద్, టిడిపి కుటమి నాయకులు చిటికల రాముముంది, కె.అప్పలరాజు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ కుసుమ, వెల్ఫేర్ అసిస్టెంట్ లోవ కుమారి, మహిళా పోలీస్ రేవతి, డిజిటల్ అసిస్టెంట్ విజయ, యానిమల్ అసిస్టెంట్ అనుష్క తదితరులు పాల్గొన్నారు.

అప్పలరాజుపేటలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

రాజవొమ్మంగి పీహెచ్సీ పరిధి అప్పలరాజుపేట గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించారు. పిహెచ్సీ వైద్యాధికారి సుష్మా వివిధ రుగ్మతులతో బాధపడుతున్న 34 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సుష్మా మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్సీ వైద్య సిబ్బంది రామారావు, భవాని, లక్ష్మి, లక్ష్మయ్య, శ్రీనివాస్, కనకరాజు, ఆశా, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.



రోగులకు వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం



రెవెన్యూ అధికారులకు ఓటరు దరఖాస్తులిస్తున్న యుటిఎఫ్ నేతలు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు దరఖాస్తులు అందజేత

ప్రజాశక్తి -అనంతగిరి : అర్హులైన ఉపాధ్యాయ ఓటర్లు ఎమ్మెల్సీ ఎన్నికలకు తమ ఓట్లను నమోదు చేసుకోవాలని, వచ్చే నెల 6 వరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు అవకాశం ఉందని యుటిఎఫ్ నేతలు తెలిపారు. శనివారం ఉపాధ్యాయ ఓటర్లకు సంబంధించి దరఖాస్తులను మండల రెవెన్యూ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ అప్పలస్వామికి యుటిఎఫ్ బృందం అందజేసింది. మండలంలోని వివిధ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల, ఎమ్మెల్సీ ఓటరు నమోదు అప్లికేషన్లను యుటిఎఫ్ మండల శాఖ ఉమ్మడి జిల్లా పూర్వ సహాధ్యక్షులు శెట్టి రాంబాబు, మండల శాఖ కార్యదర్శి బిడ్డ సింహాచలం, సీనియర్ నాయకులు నరాజి మల్లేశ్వరరావు, గుజ్జెల దయానిధి, ఎం.సుబ్బారావు, నారాయణరావు సమీకరించి, రెవెన్యూ కార్యాలయంలో అందజేశారు. ఇంకా ఓటర్లుగా నమోదుకాని అర్హులంతా తమ ఓటును వచ్చేనెల 6లోగా నమోదు చేసుకోవాలని యుటిఎఫ్ నేతలు సూచించారు.



ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

కెజిబివి పోస్టులకు విశేష స్పందన

ప్రశాంతంగా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

ప్రజాశక్తి -పాడేరు: కెజిబివి పోస్టులకు విశేష స్పందన లభించింది. 37 భోధన, 5 భోధనేతర సిబ్బంది మొత్తం 42 ఖాళీలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరగా 436 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని జిల్లా విద్యాశాఖాధికారి పి. బ్రహ్మాజీరావు తెలిపారు. శనివారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో డీఇఒ అధ్యక్షతన 12 కౌంటర్ల ద్వారా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన జరిగింది. మిగిలిన వారికి ఆదివారం ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని డిఇఒ తెలిపారు. హెడ్ కుక్, సహాయ కుక్, స్వీపర్, స్కేవంజర్, నైట్ వాచ్‌మెన్, చౌకీదార్ పోస్టులకు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల దరఖాస్తులను కూడా పరిశీలిస్తామన్నారు. జిసిడిఒ సూర్యకుమారి పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణకు పోరాటమే శరణ్యం : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పోరాటమే శరణ్యమని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్ అన్నారు. ఆరిలోవ తోటగరువు ఉన్నత పాఠశాలలో చినగదిలి యుటిఎఫ్ మండల శాఖ 50వ స్వర్ణోత్సవ మహాసభ జిల్లా అధ్యక్షులు నేతల ప్రభాకర్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 50 ఏళ్ల యుటిఎఫ్ ప్రస్థానంలో ఉపాధ్యాయ, ఉద్యోగులకు హక్కులు, రాయతీలు సాధించడంలో రాజీ లేని పోరాటాలు చేసినట్లు గుర్తుచేశారు. ఆ స్ఫూర్తితో మరో 50 ఏళ్ల పాటు ఉపాధ్యాయ, విద్యారంగాన్ని కాపాడు కోవటానికి రాజీలేని పోరాటానికి సన్నద్ధులు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఎన్.ప్రసాద్, అధ్యక్షులుగా మురళి, ప్రధాన కార్యదర్శిగా పద్మావతి, కోశాధికారిగా కుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ముందస్తు చర్యలతో విపత్తుల్లో సత్ఫలితాలు



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: విపత్తుల సమయంలో ముందస్తు నివారణ చర్యలతో నష్టాలను నివారించవచ్చని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయతీరాజ్, రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ, గ్రామీణ నీటి సరఫరా విభాగం , ఎంపీడీవోలు, తహసిల్దార్ లతో యూనిసెఫ్ అధికారులతో కలిసి డిజాస్టర్ మేనేజ్మెంట్ ముందస్తు చర్యలు, వాటర్ శానిటేషన్, హైజిన్ (వాష్) కార్యక్రమాలు అమలుపై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విపత్తుల నిర్వహణకు సమర్థవంతమైన కార్యచరణ ప్రణాళికలు అమలు చేస్తామని అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు నివారణ చర్యలు చేపట్టి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం జరుగుతుందని అన్నారు. ప్రజలకు అవసరమైన తాగునీరు, నిత్యవసర సరుకులు, విద్యుత్ సదుపాయాలు సమకూర్తున్నామన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యశాల వైద్య సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. విపత్తులలో జిల్లా కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామన్నారు విపత్తులకు ఎక్కువగా గురయ్యే ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, సేవల

ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, కమ్యూనిటీ-ఆధారిత విపత్తు సంసిద్ధత ప్రణాళికలతో సహా వాష్ సౌకర్యాల అత్యవసర పరిస్థితులను వేగంగా విస్తరించడానికి వ్యూహాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్లాన్‌లలో వాష్‌ని ఏకీకతం చేస్తామన్నారు.జిల్లా విపత్తు నిర్వహణ ప్రణాళికల్లో వాష్‌ని నిర్ధారిస్తూ, స్పష్టమైన మార్గదర్శకాలతో వనరుల కేటాయింపు, అమలు, ఇంటర్‌డిపార్ట్‌మెంటల్ కోఆర్డినేషన్ సహకారం సమర్థవంతమైన సమన్వయం, సమాచార భాగస్వామ్యాన్ని నిర్ధారించడానికి ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక సంఘాల మధ్య భాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తామన్నారు. విపత్తు సంభవించే ప్రాంతాల్లో వాష్ సౌకర్యాలు, సేవలను మెరుగుపరచడానికి వ్యూహాలను వివరించే సమగ్ర జిల్లా కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తామన్నారు. గ్రామాలలో గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. హాబిటేషన్లో అవసరాలను గుర్తించి మౌలిక సదుపాయాలను సమకూరుస్తామని చెప్పారు. గ్రామాలలో తాగునీటి సదుపాయాలు, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి వరద బాధితులకు సహాయక చర్యలు అందిస్తున్నామన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు సమస్యలను సేకరించి పరిష్కార చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె. అభిషేక్ గౌడ్, డిఆర్ఒ బి.పద్మావతి, డిఆర్‌డిఎ పీడీ .వి.మురళి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషా, వర్చువల్ విధానంలో యూనిసెఫ్ వాష్ స్పెషలిస్ట్ వెంకటేష్, యూనిసెఫ్ టెక్నికల్ సహాయకులు నిర్మల రాణి, కాలేశ్వరరావు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

146 కిలోల గంజాయి స్వాధీనం

ఇద్దరు అరెస్ట్ : మరో ఇద్దరి కోసం గాలింపు

ప్రజాశక్తి- నక్కపల్లి : ఉమ్మడి విశాఖ జిల్లా ఏజెన్సీ ప్రాంతం నుంచి ఒక కారులో 146 కేజీల గంజాయిని అక్రమంగా తరలిస్తుండగా శనివారం ఉదయం వేంపాడు టోల్ ప్లాజా వద్ద సీఐ కుమారస్వామి సిబ్బందితో తనిఖీలు చేపట్టి పట్టుకున్నారు. ఈ సందర్భంగా సిఐ కుమారస్వామి విలేకరులతో మాట్లాడుతూ మహారాష్ట్రకు చెందిన రామేశ్వర్ చౌహాన్, రాబిన్ అనే వ్యక్తులు ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయి తీసుకురావాలని మోమిన్ రీస్‌జులా, ప్రకాశ్ మంగీలాల్ జయదేవన్‌లను పురమాయించడంతో వారు కారులో ఈ నెల11న విశాఖ చేరుకున్నారని, 15న రామేశ్వర్ చౌహాన్, రాబిన్ కూడా విశాఖ చేరుకున్నారన్నారు. శనివారం ఉదయం మోమిన్ రీస్ జులా, ప్రకాశ్ మంగీలాల్ జయదేవ్ కారులో 146 కేజీల గంజాయిని ముంచింగిపుట్ సమీపాన కొనుగోలు చేసి కారులో మహరాష్ట్రలోని బీడ్ జిల్లాకు తీసుకెళ్తుండగా, వేంపాడు హైవే టోల్ ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహించి పట్టుకున్నట్లు సిఐ వెల్లడించారు. రెండేసి కేజీల చొప్పున గంజాయి ప్యాకెట్లు 73 వున్నాయని, సుమారు రూ.4.38 లక్షలు విలువైన 146 కేజీల గంజాయి స్వాధీనపర్చుకుని, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశామన్నారు. ఇదే కేసులో మధ్యవర్తులుగా వున్న రామేశ్వర్‌చౌహాన్, రాబిన్ కోసం గాలిస్తున్నామన్నారు.



అసంపూర్తి కల్వర్టును పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

బందవలస బిటి రోడ్డు నిర్మాణం చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలోని వేగడ పంచాయతీ పరిధి బందవలస గ్రామం బిటి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సిపిఎం మండల నేతలు డిమాండ్ చేశారు, శనివారం వేంగడ మెయిన్ రోడ్డు నుండి బంధవలస మీదుగా డాలింపుట్టు రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం టోకూరు సర్పంచ్ కిల్లో.మొస్య, వేంగడ మాజీ సర్పంచ్ సివేరి ,కొండలరావు మాట్లాడుతూ వేంగడ మెయిన్ రోడ్డు నుండి బంధవలస మీదుగా డాలింపుట్టు, ఇతర 9 గ్రామాలకు అనుకుని ఉన్న ఈ రోడ్డుకు ఏళ్ల తరబడి అర్ధాంతరంగా నిలిచిపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బందవవలస కల్వరుతోపాటు బిటి రోడ్డు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో గ్రామస్తులు అప్పన్న.తదిలు పాల్గొన్నారు.

ఇసుక తీతతో పంట పొలాలకు నష్టం

- కాలువ పరివాహక ప్రాంతంలోని రైతులు ఆవేదన

ప్రజాశక్తి-చింతపల్లి : పంట పొలాలకు అనుకుని ఉన్న కాలువలో ఇసుక తవ్వకాలు నిలుపుదల చేయాలని బెన్నవరం పంచాయతీ. వట్టిభూసుల గ్రామం రైతులు. గేదెల దేవమ్మ గేదల సత్యనారాయణ, గేదెల విజయ్ కుమార్, గేదెల భీమలింగం, గేదెల వీరభద్రం, గేదెల అర్జున ఆందోళన వ్యక్తం చేస్తున్నారు అధికారులకు ఎంత చెప్పినా పంట పొలాలు ఆనుకొని ఉన్న కాలువలో ఇసుక తవ్వకాలు ఆపడం లేదని, దీని వల్ల కాలువను ఆనుకుని ఉన్న తమ పంటపొలాలు ఏటా కోతకు గురౌతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

తమ పంటపొలాలను నష్టపోతున్నామని అధికారులకు మొరపెట్టుకున్నా ఎటువంటి స్పందన లేకపోవడం దారుణమన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, ఇతర అధికారుల దృష్టికి తీసుకెళతామని, వారు స్పందించి తగు చర్యలు చేపట్టి తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

మన్యం అందాలు కనువిందు



రోడ్డు పొడుగునా కమ్మేసినట్లున్న పొగమంచు

ప్రజాశక్తి-హుకుంపేట: మన్యంలోని ప్రకృతి అందాలు పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుముఖం పట్టడం, మరోవైపు కమ్ముకుంటున్న పొగమంచు అందాలు సందర్శకులను కట్టిపడేస్తున్నాయి. ఇదే సమయంలో పసుపు పచ్చని వలిసె పువ్వులతో నిండిఉన్న పైర్లు నేలపై పచ్చని తివాచీ పరిచినట్లు కనిపిస్తుండగా, దానిపైనుంచి వీస్తున్న సువాసన భరితమైన పిల్లగాలులు ప్రకృతి ప్రేమికులను తన్మయత్వానికి గురిచేస్తున్నాయి. రోడ్డుపొడుగునా కమ్మేసుకున్న పొగమంచు అందాలతోపాటు, రోడ్డు అంచుల్లో పసుపుపచ్చని పూలతో నిండిన పైర్లు ఏజెన్సీ సందర్శనకు వచ్చే పర్యాటకులతోపాటు, స్థానికులను మంత్రముగ్ధులను చేస్తున్నాయనే చెప్పాలి.



పసుపు పచ్చని తివాచీ పరిచినట్లున్న వలిసె పైర్లు

పర్యాటకులతో స్నేహపూర్వకంగా మెలగాలి

ప్రజాశక్తి -అనంతగిరి : బొర్రా గుహలను తిలకించేందుకు వచ్చిపోయే పర్యాటకులతో స్నేహభావంతో మెలగాలని మోటార్ ఫీల్డ్ సిబ్బందికి ఎస్ఐ శ్రీనివాస్ సూచించారు. శనివారం మాట్లాడుతూ వాహనాలు అద్దెకు వచ్చే పర్యాటకులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, అవతల వ్యక్తులను కించపరిచే విధంగా ప్రవర్తించరాదని సూచించారు. సందర్శకుల పట్ల అసభ్యకరంగా వ్యవహరించిన వారిపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. అంతేకాకుండా వాహనానికి సంబంధించిన పూర్తిస్థాయి రికార్డులతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు, మోటారు వాహనచట్టంలోని నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు.



అవగాహన కల్పిస్తున్న సిఐ వెంకటరమణ


గంజాయి అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి-కొయ్యూరు : గంజాయి వల్ల అనర్థాలు, అడవి జంతువుల వేటపై మండలంలోని రేవళ్లు గ్రామంలో కొయ్యూరు సిఐ పి.వెంకటరమణ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా, వినియోగం చట్టరీత్యా నేరమని, అలాంటి చర్యలకు ఉపక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అడవి జంతువుల వేటలో భాగంగా పంట పొలాలు, అడవుల్లో విద్యుత్ వైర్లు వినియోగించడం నేరమని, అలా ఎవరైనా విద్యుత్ వైర్లు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. బూదరాళ్ల పంచాయతీ పరిధి గరిమండ, పిట్టల పాడు గ్రామాలలో ఎస్ఐ ప్రజలతో మమేకమై గంజాయి పంట, రవాణా, వినియోగం వల్ల వచ్చే అనర్థాలపై వివరించారు.

కారును వెనుక నుంచి ఢీకొన్న బస్సు

- ప్రయాణికులకు స్వల్ప గాయాలు

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు మండలం డౌనూరు, మర్రిపాలెం సమీపంలో శనివారం కారును వెనుక నుండి ఆర్టీసీ బస్సు ఢీకొంది. చింతపల్లి వైపు నుండి నర్సీపట్నం వైపు కారు వెళ్తుండగా, మర్రిపాలెం సమీపంలోకి వచ్చేసరికి కుక్కపిల్ల అడ్డంగా రావడంతో కారు డ్రైవర్ సడన్ బ్రేక్ వేశారు. అదే సమయంలో అదే మార్గంలో వస్తున్న ఆర్టీసీ బస్సు సడన్‌గా బ్రేక్ వేసిన కారును వెనుక నుండి ఢీకొట్టి, అదుపు తప్పి పక్కనే ఉన్న 15 అడుగుల లోయలోకి వెళ్లిపోయింది. బస్సులో 69 మంది ప్రయాణికులు ఉండగా, వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. కారు వెనుక భాగం ధ్వంసమైంది.



గ్రంథాలయాన్ని సకాలంలో తెరవకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్న మంత్రి లోకేష్

గ్రంథాలయ వ్యవస్థ బలోపేతం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న పబ్లిక్ లైబ్రరీల వ్యవస్థను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర విద్య, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. శనివారం దొండపర్తి సమీపంలోని నెహ్రూ బజార్ ప్రాంతీయ గ్రంథాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 8 గంటలకు తెరవాల్సిన లైబ్రరీని 9.45కు కూడా తెరవకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. గ్రంథాలయ సందర్శనలో భాగంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల బలోపేతానికి పలు కీలక నిర్ణయాలు ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా పబ్లిక్ లైబ్రరీల పర్యవేక్షణకు ఒక స్పెషల్ ఆఫీసర్‌ను నియమించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, నిరుద్యోగులు కాంపిటేటివ్ పరీక్షలకు ప్రిపేర్ కావడానికి దేశంలో బెస్ట్ మోడల్‌ను అధ్యయనం చేసి పబ్లిక్ లైబ్రరీ వ్యవస్థను బలోపేతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముందుగా నెహ్రూ బజార్ మున్సిపల్ ఎలిమెంటరీ స్కూలును మంత్రి లోకేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ బాలల గదిని సందర్శించి కొద్దిసేపు అందులో ఉన్న పిల్లలతో సరదాగా గడిపారు.

పుండు మీద కారం జల్లే పనులు

- ఉక్కులో 3 నెలలుగా జీతాలివ్వకుండా వైద్య పరీక్షలా ?
- కాంట్రాక్టు కార్మికుల తొలగింపునకు కొత్త నాటకం
- స్టీల్‌ప్లాంట్‌లో సరికొత్త కుట్రలకు తెరలేపిన కేంద్రం
- వంతపాడుతున్న యాజమాన్యం
- తాజా పరిణామాలపై 'కూటమి' నేతల మౌనం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'ఇది నిజంగా వింతలో వింతే'.. గతంలో కాంట్రాక్టు కార్మికులకు వైద్య సదుపాయాలు కల్పించాలని వినతులిచ్చి పోరాడినా అమలుకు ముందుకు రాని ఉక్కు యాజమాన్యం తాజాగా మాత్రం వైద్య పరీక్షలంటూ నాటకాలు మొదలుపెట్టింది. ఈ కుట్రను గుర్తించిన స్టీల్ కార్మికులు ఐక్యంగా తిప్పికొట్టేందుకు సిద్ధమవుతున్నారు. వాస్తవానికి స్టీల్‌ప్లాంట్‌లోని సుమారు 10 వేల మంది కాంట్రాక్టు వర్కర్లకు మూడు నెలల నుంచి యాజమాన్యం జీతాలివ్వకుండా వారి కుటుంబాల కడుపులను మాడ్చుతూ వస్తోంది. తాజాగా వారికి వైద్య పరీక్షల పేరుతో సరికొత్త డ్రామాకు తెర లేపింది. తిండిలేక కడుపులు మాడుతుంటే 'పుండుమీద కారం జల్లే పనులు'కు యాజమాన్యం శ్రీకారం చుట్టిందంటూ వేల మంది కార్మికులు ప్లాంట్‌లో తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇఎస్ఐ సౌకర్యం వీరికి కల్పించాలని ఎన్ని సార్లు సిఐటియు, ఇతర కార్మిక సంఘాలు మొరలు ఎట్టుకున్నా స్టీల్ యాజమాన్యం మొండికేసింది. దేశంలో కాంట్రాక్టు కార్మికులకు ఎలాంటి వైద్య సౌకర్యమూ లేని 'నవరత్న' కంపెనీ ఏదైనా ఉందంటే అది స్టీల్‌ప్లాంటే కావడం విశేషం. ధర్మంగా నెల నెలా చెల్లించాల్సిన జీతాలను కాంట్రాక్టు వర్కర్లకు చెల్లించకుండా ఉక్కు యాజమాన్యం రోజుకో కుట్రకు పాల్పడుతూ వస్తోంది. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపులనూ నిలిపేసింది.

మొన్నటి కుట్రలను ఇంకా మరువక ముందే...

ఇటీవలే 4 వేల మందికి సంబంధించిన గేట్ పాస్‌లను రాత్రికి రాత్రే స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తీసుకుని విధులను నిలిపేయాలని భావించిన సంగతి తెలిసిందే. ఆ చర్యలపై కార్మికులు పెద్ద సంఖ్యలో ప్లాంట్‌లో తిరగబడగా ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్న సంగతి విధితమే. ఇప్పుడు కొత్త డ్రామాను రక్తికట్టించాలని ప్లాంట్ యాజమాన్యం చూస్తోంది. 50 సంవత్సరాలు దాటిన కాంట్రాక్టు కార్మికులకు వైద్య పరీక్షలంటూ చేస్తోన్న హంగామాకు కాంట్రాక్టు వర్కర్లు బ్రేక్ వేసే దిశగా పోరాడుతున్నారు. ఈ నెల 22న ఇడి ఆఫీసు వద్ద భారీ ఎత్తున ధర్నాకు పిలుపునిచ్చామని, వైద్య పరీక్షలకు వెళ్లొద్దని కాంట్రాక్టు వర్కర్లకు చెప్పామని కాంట్రాక్టు వర్కర్ల యూనియన్ నాయకులు శ్రీనివాస్ తెలిపారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను లాభాల బాటలోకి తీసుకెళ్లే పనులకు కాకుండా 'మ్యాన్‌పవర్'ను ఎలా తగ్గించేయాలన్న తలంపుతో కేంద్రంలోని బిజెపి పావులు కదుపుతోందని స్పష్టమవుతున్నా రాష్ట్రంలోని టిడిపి, జనసేన కూటమి మౌనం దాల్చడం గమనార్హం.

అసలు వ్యూహం ఏమిటి ?

కేంద్రం వ్యూహాన్ని యాజమాన్యం పక్కాగా అమలు చేసేందుకు క్రమంగా అడుగులు వేస్తోంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో రా మెటీరియల్ ఇచ్చి, ఉత్పత్తి పెంచి, మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు నడిపితే ప్లాంట్‌లో ఇప్పుడున్న వర్కర్లు సైతం సరిపోరు. ముడిసరుకు, నిధులు సమకూరితే ప్లాంట్‌కు లాభాలు కూడా వస్తాయి. కాబట్టే కేంద్రం కొన్ని చర్యలకు యాజమాన్యాన్ని ఆదేశించింది. రా మెటీరియల్ ఇవ్వకుండా, ఫర్నేస్‌లు పనిచేయకుండా, ఉత్పత్తి తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇదే జరిగితే కార్మికులు ఇంత అవసరం లేదు. ఈ నేపథ్యంలో కాంట్రాక్టు కార్మికులపై వేటు వేసి ప్రైవేట్ వాళ్లకు ప్లాంట్‌ను కట్టబెట్టే కుట్ర దీంట్లో దాగి వుంది.

పర్యాటకంతో విద్యార్థులకు విజ్ఞానం, వినోదం



విద్యార్థులతో కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పర్యాటక రంగాన్ని అన్ని వర్గాల వారికీ చేరువ చేయాలనే సంకల్పంతో.. విశిష్టతలను, విశేషాలను విద్యార్థులకు తెలియజేయాలనే ఉద్దేశంతో మూడు సెక్టార్లలో ఎడ్యుకేషనల్ టూరిజాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని, తద్వారా విద్యార్థులకు వినోదం, విజ్ఞానం లభిస్తాయని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. విద్యా పర్యాటకం ద్వారా విద్యార్థులకు చారిత్రక ప్రదేశాల విశేషాలు, విశిష్టతలు తెలుస్తాయని అన్నారు. ఎడ్యుకేషనల్ టూరిజంలో భాగంగా ప్రవేశ పెట్టిన నూతన విధానానికి ఆయన శనివారం శ్రీకారం చుట్టారు. గాయత్రీ విద్యాపరిషత్, అగనంపూడి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులతో స్థానిక కలెక్టరేట్ నుంచి బయలుదేరిన విద్యా పర్యాటక ఐటెనరరీ బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. పర్యాటక, విద్యా, ఫారెస్ట్, మత్స్యశాఖ అధికారులతో కలిసి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడ్యుకేషనల్ టూరిజంలో భాగంగా విద్యార్థుల సౌలభ్యం నిమిత్తం జిల్లాలోని వివిధ పర్యాటక కేంద్రాలను అనుసంధానం చేశామని, వాటిల్లో ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివే వారికి ఉచితంగా, ప్రయివేటు విద్యా సంస్థల వారికి రూ.10 కనీస రుసుంతో ప్రవేశాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. మెరైన్ మ్యూజియం ఎడ్యుకేషనల్ టూర్‌లో భాగంగా సాగరతీరంలో ఉన్న పర్యాటక ప్రాంతాలను సందర్శించవచ్చున్నారు. సీ - హారియర్ మ్యూజియం, టియు-167, ఐఎన్ఎస్ కురుసురా సబ్ మెరైన్, మారిటైమ్ మ్యూజియంలను విద్యార్థులు సందర్శించవచ్చని, గైడ్‌లు విశేషాలను తెలుపుతారని వివరించారు. టైడ్ పూలింగ్‌కు వెళ్లేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. దీని ద్వారా భూమి, జీవావరణ శాస్త్రంపై అధ్యయనం చేసేందుకు విద్యార్థులకు అవకాశం లభిస్తుందన్నారు. జీవ వైవిధ్య పర్యటనలో భాగంగా పర్యావరణంలోని జీవరాశులను అధ్యయనం చేసే అవకాశం లభిస్తుందన్నారు. ఇందిరా గాంధీ జులాజికల్ పార్క్, కావులుప్పాడ సమీపంలోని బయోడైవర్సిటీ పార్కును సందర్శించవచ్చని, కంబాలకొండ అభయారణ్యంలో కొన్ని ట్రెక్కింగ్ అనుభవాలను కూడా విద్యార్థులు సొంతం చేసుకోవచ్చని సూచించారు. తీర పర్యావరణ వ్యవస్థ యాత్రలో భాగంగా ఏయూలోని జీవశాస్త్ర ప్రయోగశాలని విద్యార్థులు సందర్శించవచ్చని, మడ అడవుల పరిశోధన కేంద్రం, ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా మ్యూజియంను చూసే అవకాశం కలుగుతుందని చెప్పారు. ఈ యాత్ర ద్వారా పర్యావరణ పరిక్షణకు ఆయా జీవులు ఏ విధంగా దోహదపడతాయో, ప్రకృతిని ఎలా కాపాడుకోవాలో విద్యార్థులకు సంపూర్ణ అవగాహన కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



అర్లాయిపుట్టులో పల్లె పండగ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ త్రినాథ్ తదితరులు

పలు చోట్ల 'పల్లె పండగ'

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు : మండలంలోని అతి మారుమూల లక్ష్మీపురం పంచాయతీ అర్లాయిపుట్టు గ్రామంలో శనివారం పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచి కొర్ర త్రినాథ్ అధ్యక్షతన ఎపిఒ సంగం నాయుడు ఆధ్వర్యంలో ఫారం ఫండ్ పనులను శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా సర్పంచ్ కొర్ర త్రినాథ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను గుర్తించి ప్రత్యేక నిధులతో పల్లెపండుగలో అత్యవసర పనులు చేపట్టడం సంతోషం వ్యక్తం చేశారు. గస్టు 23న నిర్వహించిన గ్రామసభలో తీర్మానించిన పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాలనిారు.

ఎపిఒ నాయుడు మాట్లాడుతూ గ్రామల్లో సిసి రోడ్లు, డ్రైనేజీలు, ఇంకుడుగుంతలు వంటివి పల్లెపండుగలో చేపట్టనున్నట్లు వెల్లడించారు.కార్యక్రమంలో ఎంపిటిసి వి.సాధురాం, వార్డు సభ్యులు త్రినాథ్, హరి, విఆర్‌పిలు దాసుధ, శాంతమ్మ సచివాలయ సిబ్బంది దేవేంద్రుడు, శిరీష, గిరిజ పాల్గొన్నారు.

చింతపల్లి : పల్లె పండగ ముగింపు కార్యక్రమం మండలంలోని తమ్మంగుల పంచాయతీ సుద్ధగరువు గ్రామంలో శనివారం నిర్వహించారు.ఎంపిటిసి అప్పారావు ఆధ్వర్యంలో టిడిపి నాయకుడు భీమన్న అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి టిడిపి జనసేన పార్టీలకు చెందిన మండల అధ్యక్షులు కిలో పూర్ణచంద్రరావు, వంతల బుజ్జిబాబులతో సర్పంచ్ సలిమితి లక్ష్మయ్య అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మయ్య మాట్లాడుతూ, గ్రామసభల తీర్మానాలు ద్వారా పల్లెపండుగలో సమస్యలను పరిష్కరించుకోవడం, అభివృద్ధి పనులు చేపట్టడం మంచి పరిణామం అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ ఉపసర్పంచ్ కే మల్లేశ్వర రావు, వార్డు సభ్యుడు శ్రీను, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ ప్రసాద్, టెక్నికల్ అసిస్టెంట్, విఆర్‌పిలులు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

దేవీపట్నం : పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా మండలంలో పలు అభివృద్ధి పనులకు టిడిపి కూటమి నాయకులు శనివారం శంకుస్థాపన చేశారు. రూ.4 లక్షలతో మంటూరు పుంత రోడ్డు, తన్నూరు పంచాయితీ కచ్చూలూరు ఆర్ అండ్ ఆర్ కాలనీలో రూ.9 లక్షలతో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మరిశెట్ల బుజ్జిబాబు, జనసేన మండల అధ్యక్షులు సారపు రాయుడు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మాగాపు బాబురావు, నియోజవర్గం మీడియా కోఆర్డినేటర్ కేశవరపు చంద్రకుమార్, ఎన్ఆర్ఈజిఎస్ ఏపీడి శ్రీనివాసరావు, జేఈ వీర్రాజు, పంచాయతీ సెక్రటరీ పద్మశ్రీ, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సిపి ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం కమిషనరేట్ పరిధిలో లా అండ్ ఆర్డర్ పరిరక్షణలో భాగంగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి శుక్రవారం రాత్రి ఈస్ట్ ఎసిపి కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. రాత్రి వేళ ఈస్ట్ సబ్ డివిజన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది నిర్వహిస్తున్న విధులను సమీక్షించారు.

ఆతిథ్య రంగానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రోజురోజుకూ విశాఖపట్నం మెట్రోపాలిటన్ సిటీగా ఎదుగుతున్న నేపథ్యంలో హోటల్, ఆతిథ్య రంగానికి మరింత ప్రాముఖ్యతను ఇవ్వడానికి కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుందని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు శ్రీభరత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హోటల్ ఇండస్ట్రీకి ఇచ్చిన హామీ మేరకు రాత్రి 12 గంటల వరకు హోటళ్లు, రెస్టారెంట్లను నడిపే అవకాశం కల్పించడం ద్వారా ఈ రంగానికి మద్దతు ఇవ్వడమే కాకుండా, గతంలో ఉన్న అనుకూల వాతావరణాన్ని పునరుద్ధరించేందుకు కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు.